క్లుప్తంగా

కాలువ గట్టు కంకర తరలిస్తే కఠిన చర్యలు

ఉంగుటూరు: నల్లజర్ల మండలం సరిహద్దు నుంచి ఉంగుటూరు మండలంలో ప్రవహించే పోలవరం కుడికాలువ గట్టుపై ఉన్న కంకరను తరలించే హక్కు ఎవరికీ లేదని తహసీల్దారు వెంకరమణ సోమవారం అన్నారు. గోపాలపరం, గొల్లగూడెం నల్లమాడు, యర్రమిల్లిపాడు, గ్రామాలమీదుగా వెళ్లే కాలవు వెంబడి ఉన్న కంకర అక్రమంగా రవాణా చేయకుండా పోలీసు, ఇరిగేషన్ పంచాయతీ గ్రామస్థాయి బృందాలు ఏర్పాటుచేసి పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. అనుమతి లేకుండా కంకర రవాణా నేరమని తెలిపారు. కంకర తవ్విన వారిపై ఇప్పటివరకు 5 కేసులు నమోదుచేసి వారి వద్ద నుంచి 8 వాహనాలు, జేసీబీ సీజ్ చేశామన్నారు.

మంత్రి రోజాకు బండారు క్షమాపణ చెప్పాలి

దెందులూరు: రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజాకు మాజీ మంత్రి బండారు సత్యనారాయణ క్షమాపణ చెప్పాలని విజయవాడ కనకదుర్గమ్మవారి ఆలయ ట్రస్టు బోర్డు డైరెక్టర్ తొత్తడి వేదకుమారి, దెందులూరు జెడ్పీటీసీ నిట్టా లీలా నవకాంతం, ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత డిమాండ్ చేశారు. సోమవారం దెందులూరులో ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ బండారు రాష్ట్ర మంత్రిపై చేసిన వ్యాఖ్యలు క్షమించరాని విషయమన్నారు. మంత్రి రోజాకు క్షమాపణ చెప్పే వరకు మహిళలంతా ఉద్యమిస్తామని అన్నారు. మహిళలను కించపరిచే వ్యాఖ్యలు చేసే వారిని కఠినంగా శిక్షించాలని వేదకుమారి డిమాండ్ చేశారు.

ఇంటర్ మార్కుల జాబితాలు సిద్ధం

పెదపాడు: 2022–23 విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణులైన విద్యార్థుల మార్కుల జాబితాలు పొందాలని పెదపాడు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జీ సుబ్రహ్మణ్యేశ్వరరావు తెలిపారు. విద్యార్థులు లేదా, వారి తల్లిదండ్రులు కళాశాలకు వచ్చి మార్కుల జాబితాలు తీసుకువెళ్లాలన్నారు. ఈనెల 11 నుంచి క్వార్టర్లీ పరీక్షలు నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు.

నేడు కైకరంలో గడపగడపకు మన ప్రభుత్వం

ఉంగుటూరు: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఈనెల 10 వతేదీ సాయంత్రం 4గంటలకు కై కరంలో నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మరడ మంగరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పాల్గొంటారని తెలిపారు. ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, అధికారులు పాల్గొనాలని మంగరావు కోరారు.

నేడు పెదపాడులో..

పెదపాడు: పెదపాడు గ్రామ శివారు రామచంద్రపురంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహిస్తున్నట్లు పెదపాడు ఎంపీడీవో ఎస్ నిర్మలజ్యోతి తెలిపారు. మధ్యాహ్నం 3గంటల నుంచి నిర్వహించే ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పాల్గొని ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరిస్తారని, దీంతోపాటు ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పెదపాడు మండలంలోని మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొనాలని తెలిపారు.

నేడు సానిగూడెంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

దెందులూరు: సానిగూడెంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని తెలిపారు. సర్పంచ్ శనపల్లి రామకృష్ణ (విష్ణు) అధ్యక్షతన వైద్య సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ముఖ్య అతిథిగా విచ్చేస్తారని తెలిపారు.

వాల్మీకికి ఘన నివాళి

భీమడోలు: భీమడోలు, గుండుగొలను, పూళ్ల శాఖా గ్రంథాలయాల్లో సోమవారం వాల్మీకి మహర్షి జయంతిని నిర్వహించారు. వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన బాలబాలికలు, పెద్దలు, యువకులు పాల్గొన్నారు. రామాయణాన్ని రచించిన వాల్మీకి మహర్షికి ఘన నివాళులర్పించారు. భీమడోలు గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ వాల్మీకి చిత్రపటానికి మాలవేసి నివాళులర్పించారు. గ్రంథపాలకుడు డీఎస్‌బీ అమర్‌నాథ్, జి.నాగమణి, యువకులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

ఏలూరు టౌన్: ఏలూరు త్రీటౌన్ పరిధిలో గంజాయి తరలిస్తున్న నిందితుడు వల్లాల మోసారావు అలియాస్ మోజెష్‌ను ఏలూరు త్రీటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఏలూరు అర్బన్ తహసీల్దార్ సోమశేఖర్ సమక్షంలో నిందితుడ్ని అదుపులోకి తీసుకుని అతని నుంచి 1.3 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు త్రీటౌన్ సీఐ కోమాకుల శివాజీ తెలిపారు. నిందితుడు గుంటూరు జిల్లా నిదానంపాడుకు చెందిన వ్యక్తి కాగా.. కొంతకాలంగా ఏలూరులోనే తన కుటుంబంతో సహా ఉంటున్నాడు. నిందితుడు మోసారావు మార్చి, ఆగస్టు నెలలో గంజాయి వ్యాపారం చేసినట్లు కేసులు నమోదు కాగా, అతను పోలీసుల నుంచి తప్పించుకుని తిరుగుతున్నాడు. పోలీసులు అతని కోసం గాలింపు చర్యలు చేపట్టిన నేపథ్యంలో ఆదివారం సాయంత్రం అరెస్టు చేసి న్యాయస్థానం ముందు హాజరుపరచగా కోర్టు 14 రోజుల రిమాండ్ విధించినట్లు సీఐ శివాజీ తెలిపారు.

జగనన్న ఆరోగ్య సురక్షలో నాణ్యమైన వైద్యం

గణపవరం: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో నాణ్యమైన అన్ని రకాల వైద్యసేవలు, మందులు ఉచితంగా ఇస్తున్నామని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఆరోగ్య సురక్ష ప్రత్యేక అధికారి కె.శ్రీనివాస్ అన్నారు. సోమవారం గణపవరం మండలం అర్ధవరంలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ఆయన పరిశీలించారు. వైద్య సేవలు అందుతున్న తీరు, మందుల పంపిణీ, తదితర కార్యక్రమాలను ఆయన తనిఖీ చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహారం స్టాల్స్ పరిశీలించారు. ఈశిబిరంలో సుమారు 850 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. 96 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరుగురికి కళ్లజోళ్లు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గాతల సుజాత, ఎంపీటీసీ సభ్యుడు సుభాష్, ఎంపీడీవో జ్యోతిర్మయి, వైద్యులు పులపర్తి సంతోష్, కె.ప్రియాంక, ప్రసూతి వైద్య నిపుణులు దివ్యారెడ్డి, నీహారిక, తహసీల్దార్ పమ్మి లక్ష్మి, సీహెచ్‌వో జాలాది విల్సన్ పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షకు తరలివచ్చిన జనం

భీమడోలు: గుండుగొలను సచివాలయం- 2 వద్ద సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి జనం పోటెత్తారు. సచివాలయం పరిధిలోని ఇంటింటికీ వెళ్లి సర్వే చేసిన బృందాలు సుమారు 369 మందికి కూపన్లు అందించారు. మరో 100 మంది వైద్య శిబిరానికి తరలిరావడంతో ఆ ప్రాంతమంతా రద్దీగా మారింది. దివ్యాంగులను ఆపదమిత్రలు శిబిరానికి తీసుకు వచ్చారు. తొలుత నిర్వహించిన కార్యక్రమానికి గ్రామ కార్యదర్శి మురళీ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఎంపీడీవో సీహెచ్ పద్మావతి దేవి, తహసీల్దార్ ఎం.ఇందిరాగాంధీ పాల్గొని ప్రసంగించారు. వైద్యులు బి.లీలా ప్రసాద్, కె.శ్రీలక్ష్మి, గైనిక్, పిల్లల వైద్య నిపుణులు వైద్య పరీక్షలు చేసారు. కంటి వైద్య నిపుణులు పరీక్షలు నిర్వహించి కళ్లజోళ్లను ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్‌డీ సుందరి, వీఆర్వోలు కె.శంకర్, వి.వెంకటేశ్వరరావు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.


గణపవరం: అర్ధవరంలో రోగులకు వైద్యపరీక్షల కిట్లు అందజేస్తున్న ప్రత్యేకాధికారి శ్రీనివాస్


భీమడోలు: గుండుగొలనులో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్షకు తరలి వచ్చిన జనం


భీమడోలు: గుండుగొలనులో వృద్ధులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

పరీక్షలతోనే సంపూర్ణ ఆరోగ్యం

దెందులూరు: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు ప్రజలకు వరమని సీతంపేట సర్పంచ్ పరసా లక్ష్మీ సుజాత అన్నారు. సోమవారం సీతంపేటలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. 660 మందికి 20 విభాగాల్లో వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారని వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు కోటిపల్లి సురేష్, సొసైటీ చైర్మన్ నల్లూరి వెంకట్రామయ్య (బాబి) అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రియదర్శిని, ఎంపీడీఓ ఏబీపీవీ లక్ష్మి, వైద్య బృందం, వైఎస్సార్ సీపీ నాయకులు కనకరాజు, ఉదయభాస్కర్ ఉన్నారు.

గోపినాథపట్నంలో..

ఉంగుటూరు: జగనన్న సురక్ష వైద్య శిబిరాలు పేద ప్రజలకు ఎంతగానో ఉపయోగపడతాయని ఉంగుటూరు ఎంపీడీవో ప్రేమాన్విత అన్నారు. సోమవారం గోపినాథపట్టణంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. సర్పంచి పుత్సకాయల విష్ణుమూర్తి ఏర్పాట్లు పర్యవేక్షించారు. వైద్యశిబిరంలో డా.సుబ్బరాజు వర్మ, జనరల్ సర్జన్ పి.అనూష, డెర్మటాలజిస్టు ఎస్‌దుర్గా అపురూప వైద్యసేవలు అందజేశారు. ఈ శిబిరంలో తిమ్మయ్యపాలెం సర్పంచి సింహాద్రి శ్రేదేవి, ఎంఈవో కె. శ్రీనివాసరావు పాల్గొన్నారు. 371 మంది ఈ వైద్యశిబిరంలో సేవలు పొందారు.

జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన

పెదపాడు: జగనన్న ఆరోగ్య సుర క్ష కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని జెడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ తెలిపారు. పెదపాడు మండలంలోని సకల కొత్తపల్లిలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. ఓపీ రిజిస్ట్రేషన్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. మందులు పంపిణీ చేసారు. ఐసీడీఎస్ వారు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. ఎస్ కొత్తపల్లిలో 230 మంది పరీక్షలు చేయించుకోవడం మంచి పరిణామమని ఆమె అన్నారు. ప్రతి మూడు నెలల కొకసారి గ్రామాల్లో ఆరోగ్య సురక్షలో వైద్య పరీక్షలు నిర్వహిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారని ఆమె చెప్పారు. వైద్యులు పాల్, చక్రధర్‌తో పాటు ఏఎంసీ చైర్మన్ అప్పన కనకదుర్గాప్రసాద్, బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, సర్పంచ్ చేపేని రంగారావు, వైకుంఠపు ధనంజయ్ పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు ఎంతో మేలు

పెదవేగి : జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా పేదలకు అన్ని రకాల వైద్య సేవలను అందిస్తున్నట్లు జగన్నాథపురం సర్పంచ్ మాత్రపు కోటేశ్వరరావు అన్నారు. సోమవారం మండలంలోని జగన్నాథపురం పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జి రాజ్‌మనోజ్, ఎంఈఓ2 అరుణ్‌కుమార్, ఎంపీటీసీ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, సచివాలయ కార్యదర్శి, డాక్టర్లు మాధవి, భాగ్యశ్రీ, ప్రత్యూష పాల్గొన్నారు.


దెందులూరు: సీతంపేటలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు


పెదపాడు: ఎస్ కొత్తపల్లిలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ


ఉంగుటూరు: వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో ప్రేమాన్విత, సర్పంచి విష్ణుమూర్తి


పెదవేగి: జగన్నాథపురంలో వృద్ధులకు కళ్లజోడు అందజేస్తున్న సర్పంచ్, అధికారులు

11న 'జగనన్నకు చెబుదాం'

భీమడోలు: భీమడోలులో ఈనెల 11వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు మండల స్థాయిలో నిర్వహించనున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ హాజరవుతారని భీమడోలు ఎంపీడీవో సీహెచ్ పద్మావతి దేవి, తహసీల్దార్ ఎం.ఇందిరాగాంధీ సోమవారం రాత్రి తెలిపారు. ప్రతి బుధవారం, శుక్రవారం మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం గ్రీవెన్స్‌డే కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారని తెలిపారు. మండలంలోని ప్రజలు తమ సమస్యలపై వినతులు అందించవచ్చని తెలిపారు. జిల్లాస్థాయి అధికారులు ఈ కార్యక్రమానికి హాజరవుతారని వారు తెలిపారు.

ప్రభుత్వ భవనాలను నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాలి

పెదపాడు: గ్రామ సచివాలయం, ఆర్‌బీకే భవనాలను నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. పెదపాడు మండలంలోని సత్యవోలులో నిర్మిస్తున్న గ్రామ సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రం, వెల్ నెస్ సెంటర్లను ఆమె సోమవారం పరిశీలించారు. త్వరలో వాటిని ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం శ్మశాన వాటికను సందర్శించి ఫెన్సింగ్ ఏర్పాటు చేసేందుకు అంచనాలు తయారు చేయాలని అధికారులకు సూచించారు. తాండ్ర పాపారాయుడు విగ్రహం సెంటర్‌లో కాలువపై వంతెనను అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఆర్ డీఈ లీలీమోహన్, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ సీహెచ్ రమేష్, ఏఈ శ్రీనివాస్, ఉపసర్పంచ్ పెంకి శ్రీనివాసరావు, వైకుంఠపు ధనంజయ్ తదితరులు పాల్గొన్నారు.


గ్రామ సచివాలయ భవనాలను పరిశీలిస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ

మైక్రో ఫిల్టర్లను పరిశీలించిన జెడ్పీ చైర్మన్

మైక్రో ఫిల్టర్ ట్రయల్ రన్ నిర్వహించాలని జెడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావు తెలిపారు. పెదపాడు మండలంలోని సత్యవోలులో ఇటీవల నిర్మించిన మైక్రో ఫిల్టర్లను సోమవారం ఆమె పరిశీలించారు. మైక్రో ఫిల్టర్ కారణంగా శుద్ధ జలాలను ప్రజలకు అందించే అవకాశముందన్నారు. ఈకార్యక్రమంలో ఆమె వెంట బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, ఏఎంసీ అధ్యక్షుడు అప్పన ప్రసాద్, పీఆర్ డీఈ లీలామోహన్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సీహెచ్ రమేష్, ఉపసర్పంచ్ పెంకి శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ రమేష్, ఏఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కోళ్ల వ్యర్థాల వాహనం సీజ్

పెదపాడు: కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వాహనం సీజ్ చేసినట్లు పెదపాడు పోలీసులు సోమవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. పెదపాడు మండలంలోని నాయుడుగూడెం శివారు ప్రాంతమైన కేవీకే పురం నుంచి నాయుడుగూడెం వైపునకు కోళ్ల వ్యర్థాల వాహనంలో తరలిస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. కోళ్ల తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేసిటనట్లు తెలిపారు. వాహనంలోని 9 టన్నుల కోళ్ల వ్యర్థాలను ధ్వంసం చేసి డ్రైవర్, హెల్పర్, వాహన యజమాని, చేపల చెరువు యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చల్లా కృష్ణ తెలిపారు.

సర్వేయర్ ఆత్మహత్య

గణపవరం: మండలంలోని జల్లికాకినాడకి చెందిన సచివాలయ సర్వేయర్ అద్దేపల్లి వెంకటలక్ష్మీ దుర్గారావు (27) ఆదివారం రాత్రి ఇంటి వద్ద ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు గణపవరం ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు. ఈయన ఉండి మండలం కోలమూరు గ్రామ సచివాలయంలో సచివాలయ సర్వేయర్‌గా పనిచేస్తున్నారు. ఇతను అవివాహితుడు. ఆదివారం సెలవు కావడంతో ఇంటి వద్దనే ఉన్న దుర్గారావు అర్ధరాత్రి దాటిన తర్వాత వంట గదిలో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులంతా నిద్రిస్తున్న సమయంలో ఆయన ఈఘాతుకానికి పాల్పడ్డాడు. అర్ధరాత్రి 1 గంట సమయంలో లేచిన తల్లి దుర్గారావు ఫ్యానుకు వేలాడుతుండటం చూసి ఇంట్లో వారిని నిద్రలేపింది. కుటుంబ సభ్యులు దుర్గారావును కిందికి దింపగా అప్పటికే మృతి చెందాడు. దుర్గారావు ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. దుర్గారావు తండ్రి నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వార్డు మెంబరు రామకృష్ణ మృతిపై దర్యాప్తు చేయాలి

దెందులూరు: మండలంలోని గాలాయగూడెంకు చెందిన పంచాయతీ వార్డు మెంబరు ఏనుగు రామకృష్ణ (30) సహజ మరణం కాదని, ఈ ఘటనపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి వాస్తవాలు వెలికి తీయాలని మృతుని కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు సోమవారం రాత్రి ధర్నా నిర్వహించారు. వివరాల్లోకి వెళితే రామకృష్ణ ఆదివారం సాయంత్రం తన వాహనంపై ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. పెదవేగి మండలం లక్ష్మీపురం పంచాయతీ పరిధిలో రామకృష్ణ మృతదేహాన్ని సోమవారం ఉదయం అతని బంధువులు గుర్తించారు. వాహనం తాళం, మృతదేహం పడి ఉన్న తీరు అనుమానాస్పదంగా ఉందని వారన్నారు. ముమ్మాటికీ ఇది సహజ మరణం కాదని దీని ఉన్న వెనుక ఉన్న సూత్రధారులు, కుట్రదారులను పోలీసులు కనిపెట్టి వారిపై చర్య తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. మృతదేహంతో గాయాలగూడెం రహదారిపై మధ్యాహ్నం ధర్నా నిర్వహించారు. పెదవేగి సీఐ దుర్గాప్రసాద్, దెందులూరు, పెదవేగి ఎస్సైలు ఐ.వీర్రాజు, లక్ష్మణ్, పోలీస్‌స్టేషన్ సిబ్బంది అక్కడికి వచ్చి మృతుని కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం రహదారిపై ధర్నా చేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడతారని, ఈ ఘటనపై నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసి వాస్తవాలను వెలికితీస్తామని బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని సీఐ హామీ ఇవ్వడంతో వారు ఆందోళనను విరమించారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. మృతుడు ఏనుగు రామకృష్ణ సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నామని కాల్స్, మెసేజ్‌లపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


గాలాయగూడెం రహదారిపై ఏనుగు రామకృష్ణ మృతదేహం వద్ద ధర్నా చేస్తున్న బంధువులు

మధ్యాహ్న భోజనం రుచిగా తయారు చేయాలి

నిడమర్రు: పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద పథకం పకడ్బందీగా నిర్వహించాలని, నాణ్యతా లోపం గుర్తిస్తే చర్యలు తప్పవని నిడమర్రు ఎంఈవో-2 కె.రాంబాబు అన్నారు. సోమవారం నిడమర్రు మండలం చానమిల్లి, బావాయిపాలెం ఉన్నత పాఠశాలల్లో ఆయన మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన తనిఖీ చేశారు. ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. చిక్కీలు, రాగిజావ, కోడిగుడ్ల వినియోగం తీరును తనిఖీ చేశారు. ఆహార పదార్థాలు రుచికరంగా, పరిశుభ్రంగా ఉండాలని, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఈవిషయంలో బాధ్యతగా పనిచేయాలని సూచించారు. విద్యార్థులను మధ్యాహ్న భోజనం నాణ్యతపై వాకబు చేశారు. పాఠశాలల రికార్డులు, నాడు-నేడు పనులు, అదనపు తరగతిగదుల నిర్మాణ పనులు ఆయన పరిశీలించారు. ఛానమిల్లి హైస్కూలు హెచ్‌ఎం వై.శేషగిరిరావు, ఉపాధ్యాయులు బి.దంజు, బి.రామవరప్రసాద్, లక్ష్మీనారాయణ, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.


చానమిల్లి హైస్కూల్లో మధ్యాహ్న భోజనం రుచిచూస్తున్న ఎంఈవో రాంబాబు

పోటీతత్వంతో చదవాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యార్థులంతా పోటీతత్వంతో చదివి అత్యధిక మార్కులు సాధించాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.శ్యామ్ సుందర్ సూచించారు. సోమవారం స్థానిక సత్రంపాడు ఎంపీపీ పాఠశాలను ఆయన సందర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పించే సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. 10వ తరగతిలో విద్యార్థులు మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ప్రథమ స్థానాల్లో నిలిచి ప్రభుత్వం అందిస్తోన్న నగదు బహుమతులు సాధించాలని ఆకాంక్షించారు. ఇటీవల నిర్వహించిన ఎఫ్‌ఏ 2 పరీక్షల్లో పాఠశాల స్థాయిలో తొలి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు డీఈఓ బ్యాడ్జీలను అందజేశారు. సెల్ఫీ విత్ టాపర్స్ భాగంగా విద్యార్థులతో సెల్ఫీ దిగారు. అనంతరం వర్క్ బుక్స్ పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. జగనన్న గోరుముద్దలో వడ్డిస్తున్న పదార్థాలను పరిశీలించి, పాఠశాల పరిశుభ్రత, తరగతి గదులు, వాష్ రూమ్స్ నిర్వహణలపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వి.కృష్ణ, పాల్గొన్నారు.


విద్యార్థులకు బ్యాడ్జీలు అందించిన డీఈఓ శ్యామ్ సుందర్

విజయవాడలో వైఎస్సార్ సీపీ నాయకుల సందడి


ఫ్లకార్డులతో నిడమర్రు మండల వైఎస్సార్ సీపీ ప్రతినిధులు


విజయవాడ సభకు హాజరైన ఉంగుటూరు మండలం ప్రతినిధులు

నిడమర్రు: విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో సోమవారం నిర్వహించిన వైఎస్సార్ సీపీ విస్తృతస్థాయి సమావేశంలో నిడమర్రు మండలం నుంచి పార్టీ మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ ఆధ్వర్యంలో పలువురు ముఖ్య నేతలు హాజరయ్యారు. ఈ సమావేశంలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 175కి 175 సీట్లు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గెలుస్తుందంటూ ఫ్లకార్డులు ప్రదర్శించి సందడి చేసారు. ఈ సమావేశానికి హాజరైన వారిలో జెడ్పీటీసీ కోడే కాశి, ఎంపీపీ ధనుకొండ ఆది లక్ష్మి, మండల సచివాలయాల కన్వీనర్ నౌడు అచ్యుతరామారావు, వైస్ ఎంపీపీ సమయం వీరరాఘవులు తదితరులున్నారు.

ఉంగుటూరు: విజయవాడలో సోమవారం నిర్వహించిన వైఎస్సార్ సీపీ విస్తృతస్థాయి సమావేశానికి ఉంగుటూరు మండలం నుంచి ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. సమావేశానికి తరలివెళ్లిన వారిలో వీవర్స్ జిల్లా అధ్యక్షుడు దొంతంశెట్టి సత్యనారాయణ, జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, మండల అధ్యక్షుడు మరడ మంగరావు, ఎంపీపీ ఘంటా శ్రీలక్ష్మి, పంచాయతీరాజ్ జిల్లా అధ్యక్షుడు పుప్పాల గోపి, సచివాలయాలు మండల కన్వీనర్ పెనుగొండ బాలకృష్ణ, వైస్ ఎంపీపీలు శింగిరెడ్డి సూర్యనారాయణ, మేడవరపు విద్యాలక్ష్మి, బీసీ నాయకుడు కొరిపల్లి శ్రీనువాసరావు ఉన్నారు.

పీహెచ్‌సీలో అభివృద్ధి పనులకు నేడు శంకుస్థాపన

భీమడోలు: పూళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నూతనంగా మంజూరైన అదనపు గదుల నిర్మాణానికి ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు భూమి పూజ చేస్తారని భీమడోలు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు సోమవారం తెలిపారు. పూళ్ల పీహెచ్‌సీలో బర్త్ వెయిటింగ్ గదుల నిర్మాణానికి రూ.50లక్షల నిధుల మంజూరయ్యాయన్నారు. ఆ నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు శంకుస్థాపన చేస్తారని వారు పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గార్లమడుగు విద్యార్థి ఎంపిక

పెదవేగి : జిల్లా స్థాయి కోకో జూనియర్స్ విభాగంలో గార్లమడుగు 10వ తరగతి విద్యార్థి భీమడోలు వినయ్‌కుమార్ ఉత్తమ ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైయ్యాడని పాఠశాల హెచ్‌ఎం డీ అప్పారావు తెలిపారు. కె గోకవరంలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో వినయ్ ఎంపికకావడంపై ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. చిత్తూరులో ఈనెల 20 నుంచి నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వినయ్, మరో ముగ్గురు విద్యార్థులు పాల్గొంటారని చెప్పారు.


వినయ్‌కుమార్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం

మహిళను రక్షించిన పోలీసులు

ఏలూరు టౌన్: తనను పట్టించుకోవటంలేదని, తీవ్ర మానసిక వేదనకు గురై ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన మహిళను పోలీసులు రక్షించారు. ఏలూరు నగరంలోని సీఆర్‌ఆర్ కళాశాల సమీపంలో మినీబైపాస్‌కు వెళ్లే రైల్వే లోబ్రిడ్జి వద్ద పట్టాలపై ఆత్మహత్యాయత్నానికి మహిళ ప్రయత్నించింది. విషయం తెలుసుకున్న త్రీటౌన్ పోలీసులు సీఐ కోమాకుల శివాజీ ఆధ్వర్యంలో మహిళను రక్షించారు. ఏలూరుకు చెందిన మహిళ ఆత్మహత్యకు ప్రయత్నిస్తుండగా స్థానికులు 112కు కాల్ చేసి సమాచారం అందించారు. వెంటనే త్రీటౌన్ పోలీసులు వెళ్లి ఆమెను రక్షించారు. కుటుంబ సభ్యులను పిలిచి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఆమెను జాగ్రత్తగా చూసుకోవాలని కుమారుడు, కోడలికి సూచించారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు

గణపవరం: రక్తదానం ద్వారా మనం ఆరోగ్యంగా ఉండటంతో పాటు, మరొకరికి ప్రాణదాతలు కావచ్చునని గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి అన్నారు. సోమవారం గణపవరం డిగ్రీ కాలేజీలో జువాలజీ విభాగం, ఆర్‌ఆర్‌సీ, అలుమిని అసోసియేషన్, హెల్త్ అండ్ హైజీన్ ఆధ్వర్యంలో డిగ్రీ విద్యార్థులకు రక్తపరీక్షలు నిర్వహించారు. పరీక్ష కేంద్రాన్ని ప్రిన్సిపల్ నిర్మలకుమారి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా 150 మంది విద్యార్థులకు రక్త పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ పి.మధురాజు, న్యాక్ కోఆర్డినేటర్ టి.అక్కిరాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.


గణపవరం డిగ్రీ కాలేజీలో విద్యార్థులకు రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది